క్లుప్తంగా

ఎస్టీయూ డైరీ ఆవిష్కరణ



ప్రత్తిపాడు: స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈఓ సీహెచ్ రమాదేవి ఎస్టీయూ డైరీ, క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు నజీర్, ప్రధాన కార్యదర్శి నాని, ఉపాధ్యాయులకు ఎంఈవో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు వెంకటరెడ్డి, రమణ, అంజయ్య, నాగేశ్వరరావు, వెంకట్రావు, సదాశివరావు, సత్తార్, పిచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు): వట్టిచెరుకూరు మండలం ముట్లూరులోని పునీత శౌరీ పుణ్యక్షేత్రంలో సోమవారం పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఫాదర్ కొచ్చెర్ల జ్యోతిరాజు తన తల్లిదండ్రులు శౌరయ్య, ఆంథోని రాణిల జ్ఞాపకార్థం హంగేరి దేశం బిషప్ డాక్టర్ స్పానియా అంథాల్ సహకారంతో వంద మంది పేదలకు నూతన సంవత్సర కానుకగా నిత్యావసర సరుకులను సమకూర్చారు. వీటిని పునీతశౌరి పుణ్యక్షేత్రం విచారణ గురువు ఫాదర్ మార్నేని దిలీప్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వలంటీరుకు అభినందనలు



పొన్నూరు: మండల పరిధిలోని మనిపల్లె గ్రామానికి చెందిన మేరియమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో ఇటీవల గుంటూరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం చేరింది. ఆమెకు పింఛన్ నగదును వలంటీర్ కమల కుమారి సోమవారం వైద్యశాలకు వెళ్లి అందించింది. ఈ సందర్భంగా వలంటీరును సర్పంచ్ కూచిపూడి స్వరూపారాణి, పంచాయతీ కార్యదర్శి జ్యోతి అభినందించారు.

యాచకుడి మృతి



పొన్నూరు: యాచకుడు మృతి చెందిన ఘటన నిడుబ్రోలు ఫ్లై ఓవర్ పై సోమవారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. సుమారు 55 సంవత్సరాల వయస్సు ఉన్న యాచకుడు గత కొంతకాలంగా పట్టణంలో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. రాత్రిళ్లు ఫ్లై ఓవర్ పై రైల్వే స్టేషన్‌కు వెళ్లే మెట్ల మార్గం వద్ద నిద్రిస్తుంటాడు. రెండు రోజుల నుంచి కదలకుండా అక్కడే పడి ఉండడంతో..స్థానికులు గమనించి మున్సిపల్ కమిషనర్‌కు ఎస్.రాధకు తెలిపారు. ఈ క్రమంలో గుంటూరుకు చెందిన అమ్మ సేవా సమితి సభ్యులు ముందుకొచ్చి.. మృతదేహానికి అంత్యక్రియలు చేయించారు.

పాము కాటుకు మహిళ మృతి



పెదనందిపాడు(కాకుమాను): వ్యవసాయ పనులకు వెళ్లిన మహిళ పాము కాటుకు గురై మృతి చెందిన ఘటన మండలంలోని వరగాని గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. తోటి కూలీలు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎస్సీ కాలనీకు చెందిన రేగులగడ్డ క్రీస్తురాజ్యం (40) వ్యవసాయ పనులకు వెళ్లింది. పని చేస్తుండగా.. పొలంలో ఆమెను పాము కాటు వేసింది. ఇది గుర్తించిన తోటి కూలీలు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి.. ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రజా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గం మధ్యలో ఆమె మృతి చెందింది.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

పాత గుంటూరు: వైకుంఠ ఏకాదశి సందర్భంగా అరండల్‌పేట 7వ లైనులోని శ్రీ మోహన రంగ నాయకస్వామి దేవస్థానంలో సోమవారం మహంకాళి సూర్యనారాయణశర్మ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వాతాపి గణపతి, బ్రహ్మాంజలి, గణపతి ప్రార్థన, మానస సంచరే, అలరులు కురియగ ఆడినదే, నారాయణతే నమో నమో తరంగం, మాధవ కేశవ అన్నమాచార్య కీర్తనలకు చిన్నారులు రేష్మిత, వైష్ణవి, లిఖిత, నందన, నిర్వి యశస్వి, పద్మ నృత్యాలు అలరించాయి.

ఊరూరా ముక్కోటి శోభ..

- ఉత్తర ద్వార దర్శనం సర్వపాప హరణం
- హరి నామస్మరణతో మార్మోగిన దేవాలయాలు



గుంటూరు రూరల్: ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి



ప్రత్తిపాడు రెడ్ల రామాలయం వద్ద ఉత్తర ద్వారంలో కొలువుదీరిన ఉత్సవమూర్తులను దర్శించుకుంటున్న మహిళలు



ఉత్తర ద్వారంలో కొలువుదీరిన వేణుగోపాలుడిని దర్శించుకుంటున్న మహిళలు

ప్రత్తిపాడు: మండలంలోని దేవాలయాలు సోమవారం తెల్లవారుజాము నుంచే హరి నామస్మరణతో మారుమ్రోగిపోయాయి. ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులు విష్ణుమూర్తికి భక్తి ప్రపత్తులను చాటారు. ప్రత్తిపాడు రెడ్ల రామాలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. అర్చకుడు ప్రవీణ్ స్వామి వారికి విశేష పూజలు జరిపారు. అనంతరం ఉత్సవ మూర్తులను గ్రామంలో గ్రామోత్సవంగా తరలించారు. మహిళలు తమ ఇళ్ల ముంగిటకు వచ్చి స్వామి వారికి వారులు పోసి, హారతులిచ్చి, స్వామి ఆశీస్సులు పొందారు. ఆలయాల్లో భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందించారు.

- ప్రత్తిపాడు వేణుగోపాల స్వామి దేవాలయంలో ఓంకార స్వరూపుడైన సమ్మోహన వేణుగోపాలుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, మొక్కుబడులు చెల్లించుకున్నారు. స్వామివారు మేళతాళాల మధ్య గ్రామ పుర వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు.
- రెండవ భద్రాద్రిగా పేరుగాంచిన యనమదల శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో, కొండేపాడు శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలోనూ స్వామి వారు ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

జూనం చుండూరులో..

జూనం చుండూరులోని శ్రీ సమ్మోహన వేణుగోపాల స్వామి దేవాలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు రంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు తమిరిశ రామ శేషాచార్యులు, శ్రీధర్ కుమార్‌లు స్వామి వారికి సుప్రభాత సేవను కన్నుల పండువగా నిర్వహించారు. తదనంతరం ఉత్తర ద్వార దర్శనం, గ్రామోత్సవం జరిగింది. భక్తులకు ప్రత్యేకంగా దక్షిణావృత శంఖంతో తీర్థమును అందించారు.

భక్తి శ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి

కాకుమాను: మండలంలోని గ్రామాల్లో ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని సోమవారం దేవాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో దేవతా మూర్తులు వేకువ జామున భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఇచ్చారు. అనంతరం ఆయా దేవాలయాలలో భక్తి సమాజ సభ్యులు లలిత పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. ఈ సందర్భంగా శ్రీ చెన్న కేశవ స్వామి దేవస్థానంలో దేవతామూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆయా దేవాలయాల కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కనుల పండువగా ముక్కోటి ఏకాదశి పూజలు

గుంటూరు రూరల్: నగర శివారురులోని గోరంట్ల గ్రామంలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం భక్తులకు స్వామివారి ఉత్తర ద్వారా దర్శనం కల్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. స్వామివారి ఉత్తరద్వారా దర్శనంకోసం భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలను ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గజవల్లి అప్పారావు, ప్రధాన కార్యదర్శి మేడా సాంబ శివరావు, కమిటీ సభ్యులు తదితరులున్నారు.

ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు

పొన్నూరు: పట్టణంలో శ్రీ సుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత సాక్షి శ్రీ భావనారాయణ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం తెల్లవారు జామున నాలుగు గంటలకు ఉత్తర ద్వార దర్శనం భక్తులకు కల్పించారు. ఆలయ సహాయ కమిషనర్, ఈఓ ఆర్.రమణమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో సుప్రభాత సేవ, విశేష అర్చనలు, తిరుప్పావై నీరాజనం మంత్ర పుష్పం జరిపించారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రీ సహస్ర లింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఉన్న శ్రీ స్వర్ణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ఆలయ ఈఓ టి. శ్రీనివాస్ ఏర్పా ట్లు చేశారు. కసుకర్రు గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకున్నారు. చింతలపూడి గ్రామంలో సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మండల పరిధిలోని మామిళ్ళపల్లి, నందూరు, ములుకుదురు, తదితర వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



జూనం చుండూరులో గ్రామోత్సవంగా తరలివస్తున్న వేణుగోపాల స్వామి



కాకుమాను: పురవీధుల్లో భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు



ప్రత్తిపాడు రామాలయంలో ఉత్తరద్వార దర్శనంలో ఉత్సవమూర్తులు



పొన్నూరు: కసుకర్రు గ్రామంలో వేణుగోపాల స్వామి

5న 'ఓర్వకల్లు తిరునాళ్ల' వేలం పాటలు

క్రోసూరు: అచ్చంపేట మండలంలోని ఓర్వకల్లు గ్రామంలో వేంచేసి ఉన్న గంగాదేవీ అమ్మవారి పేరంటాళ్ల తిరునాళ్లలో వివిధ వ్యాపారాలకు లైసెన్సు పొందుటకు ఈ నెల 5న వేలంపాటలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జి.రామకోటి రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రోసూరులోని వీరభద్రస్వామి దేవస్థానం ఆవరణలో మధ్యాహ్నం 11 గంటలకు వేలం పాటలు జరుగుతాయని తెలిపారు. ఫిబ్రవరి 4 నుంచి 6వ తేదీ వరకు, మార్చి 6 నుంచి 8వ తేదీ వరకు.. నెల తిరునాళ్లలో కొబ్బరి చిప్పల సేకరణ, భక్తులు సమర్పించే చీరలు, జాకెట్ ముక్కల సేకరణ, లడ్డూ ప్రసాదం, కొబ్బరికాయలు, పూజా సామగ్రి అమ్ముకునేందుకు లైసెన్స్ మంజూరుకు నిర్వహించే వేలం పాటలో హిందువులు మాత్రమే పాల్గొనాలని వెల్లడించారు. రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి పాటదారులు పాల్గొనాలని పేర్కొన్నారు. పాట పాడుకున్న వారిని మినహాయించి.. మిగతావారి డిపాజిట్లు వాపసు చేయనున్నట్లు తెలిపారు. లైసెన్స్ పొందిన వారు మొత్తం నగదులో.. సగం వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు ఫొటో, గుర్తింపుకార్డు జిరాక్స్, ఫోన్ నంబర్ ఇవ్వాలని తెలిపారు. పాట పాడుకున్న వారు మాత్రమే వ్యాపారాలు చేసుకోవాలని, సబ్ లీజ్‌కు, బదలాయింపులు చేయకూడదని తెలిపారు. వివరాలకు తనను సంప్రదించాలని పేర్కొన్నారు.

పేదలకు సాయం చేసేందుకు ముందుకు రావాలి



నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న జాన్ వెస్లీ

గుంటూరు రూరల్: పేదలు, అనాథలు, వృద్ధులకు సాయం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని వెస్లీ సర్వీసెస్ సంస్థ ఫౌండర్ చీకటి జాన్‌వెస్లీ తెలిపారు. సోమవారం మండలంలోని దాసరిపాలెం ప్లాట్స్ నందు పేదలకు నిత్యావసర సరుకులు, కూరగాయలు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వెస్లీ మాట్లాడుతూ.. కాలనీలోని 30 కుటుంబాలకు బియ్యం, కందిపప్పు, ఇతర సరకులు, కూరగాయలు అందజేసినట్లు తెలిపారు. ప్రతి నెల మండల పరిధిలోని గ్రామాల్లో 175 పేద కుటుంబాలకు తమ వంతుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఎవరికైనా ఆహారం అందక ఇబ్బందులు పడుతుంటే తమను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక చర్చి పాస్టర్ స్టీఫెన్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



నూతన పింఛన్‌దారులతో కార్పొరేటర్ శ్యామల

గుంటూరు రూరల్: ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని 26వ డివిజన్ కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి పేర్కొన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని అంకిరెడ్డిపాలెంలో నూతనంగా మంజూరైన 150 పింఛన్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలను వలంటరీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఇంటి ముందుకు అందజేస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. నూతన పింఛన్‌దారులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ శ్యామల బ్రహ్మారెడ్డి, వార్డు సచివాలయం సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ

వలంటీర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా



వృద్ధులకు కళ్లజోళ్లు అందజేస్తున్న మురళీకృష్ణ తదితరులు

పెదకాకాని : పెదకాకాని మండలం కొప్పురావూరు గ్రామంలో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. గత నెలలో బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో కొప్పురావూరులో నేత్రజ్యోతి కార్యక్రమం నిర్వహించారు. 683 మందికి కళ్లజోళ్లు అవసరమవగా.. వారందరికీ కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో బజరంగ్ ఫౌండేషన్, జగన్నామ సంక్షేమ సంవత్సరం ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో సేవలు అందించనున్నట్లు తెలిపారు.

వలంటీర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా

బజరంగ్ ఫౌండేషన్ జగన్నామ సంక్షేమ సంవత్సరం ఆధ్వర్యంలో 21 మంది కొప్పురావూరు వలంటీర్లకు రూ.5 లక్షల బీమా కల్పించినట్లు అంబటి మురళీకృష్ణ తెలియజేశారు. ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా ఈ బీమాను వలంటీర్లకు అందజేసినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ ఫౌండేషన్ డైరెక్టర్ జి.సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లేశ్వరస్వామి గ్రామోత్సవం



పెదకాకానిలోని మల్లేశ్వరస్వామి గ్రామోత్సవం

పెదకాకాని: ముక్కోటి పర్వదినం సందర్భంగా పెదకాకానిలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో రుద్రాభిషేకాలు, అమ్మవారికి ప్రత్యేక పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గుంటూరుకు చెందిన బండ్లమూడి అజయ్‌కుమార్, ఉమాదేవి కుటుంబ సభ్యులు రూ.4లక్షల వ్యయంతో తయారు చేయించిన రథాన్ని ఈఓ శ్రీనివాసరెడ్డికి అందజేశారు. ముక్కోటి సందర్భంగా పెదకాకాని పుర వీధుల్లో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు.

రైఫిల్ షూటింగ్‌లో రాజరాజేశ్వరికి కాంస్య పతకం

గుంటూరు ఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గత నెల 31న రాజమహేంద్రవరంలో నిర్వహించిన అంతర్ జిల్లా రైఫిల్ షూటింగ్ పోటీల్లో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థిని అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 9వ తరగతి విద్యార్థిని రాజరాజేశ్వరి కాంస్య పతకాన్ని సాధించడం పాఠశాలకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

ఏఎన్‌యూలో నూతన సంవత్సర వేడుకలు



కేక్ కట్ చేస్తున్న వీసీ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. పరిపాలనా భవన్‌లో వీసీ పి. రాజశేఖర్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో సమష్టిగా యూనివర్శిటీని మరింత అభివృద్ధి చేద్దామని సూచించారు. గత ఏడాదిలో యూనివర్సిటీ అనేక జాతీయ, అంతర్జాతీయ ర్యాంకులు సాధించిందని, ఆ స్ఫూర్తితో నాక్ గ్రేడ్ సాధించేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెక్టార్ పి. వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ బి. కరుణ, ఓఎస్‌డీ కె. సునీత, సీడీసీ డీన్ కె. మధుబాబు, పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ఎల్. ఉదయకుమార్, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ బి. నాగరాజు, పలువురు అధికారులు పాల్గొన్నారు. యూనివర్సిటీ ఉద్యోగ సంఘాల నాయకులు, పరిశోధకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఉర్దూ భాషా ప్రావీణ్యంతో ఉజ్వల భవిష్యత్తు



గుంటూరు ఎడ్యుకేషన్: ఉర్దూ భాషా ప్రావీణ్యంతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ మొహమ్మద్ ఖాసీం పేర్కొన్నారు. ఆయన సోమవారం ఏటీ అగ్రహారంలోని ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులతో పాటు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల్ని పరిశీలించారు. విద్యార్థుల వర్క్ బుక్స్, నోట్ బుక్స్ తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సయ్యద్ అబ్దుల్ కరీం, షేక్ హుస్సేన్‌లకు పలు సూచనలు చేశారు. పాఠ్యాంశాల్ని విధిగా ఉర్దూలో బోధించాలని, ఆ భాషతో మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలసి జగనన్న గోరుముద్దను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలు ప్రతి విద్యార్థికి అందే విధంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల వివరాల్ని ఆన్‌లైన్‌లో పొందుపర్చే విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ప్రత్తిపాడు ఏఎంసీ పదవీ కాలం పొడిగింపు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు వ్యవసాయశాఖ మార్కెట్ యార్డు కమిటీ పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పాటు పొడిగిస్తూ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ పదవీ కాలం గత ఏడాది అక్టోబరు 27వ తేదీతో ముగిసింది. మరో ఆరు నెలలు పాటు ప్రస్తుత కమిటీనే పొడిగిస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవ్ చౌదరి ఉత్తర్వులిచ్చారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు చైర్మన్ మెట్టు రాజేశ్వరి స్పందించారు. నియోజకవర్గంలోని రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, బోర్డు సభ్యుల సహకారంతో విస్తృత సేవలు అందిస్తామన్నారు. కమిటీ పొడిగింపునకు కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే సుచరితకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

'స్పందన'కు 11 అర్జీలు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్ కేధార్‌నాథ్

పొన్నూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీకాంత్ కేదార్‌నాథ్ అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను విన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు ఉన్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. స్పందన కార్యక్రమంలో మొత్తం 11 అర్జీలు వచ్చాయని చెప్పారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శేషమాంబ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల సారథి..

కాకుమాను: సంక్షేమ పథకాల సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. మండలంలోని రేటూరు పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుల్జార్‌బేగం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, సర్పంచ్ షేక్ సైదా, ఉప సర్పంచ్ వల్లూరి సుధాకర్, బొక్కిసం చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.



కాలువ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ యానాదిరావు

మురుగు కాల్వల ఏర్పాటు

పొన్నూరు: మామిళ్ళపల్లి గ్రామంలోని ముదిరాజ్ కాలనీలో మురుగు పారుదలకు సర్పంచ్ జాలాది యానాదిరావు సోమవారం కాలువలను తీయించారు. ఎర్త్‌మూవర్‌తో అంతర్గతరోడ్లకు ఇరువైపులా కాలువలు తీయించి, పనులను పరిశీలించారు. గ్రామంలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

ఘనంగా ముక్కోటి ఏకాదశి పూజలు

చేబ్రోలు: మండలంలో సోమవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదికేశవ స్వామి, శ్రీరంగనాథ స్వామి , జ్వాలా లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానాల్లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నారా కోడూరులోని లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం, వేజండ్లలోని వేణుగోపాల స్వామి దేవస్థానాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఉత్తర ద్వార దర్శనం కోసం తెల్లవారు జాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు విచ్చేశారు. శ్రీరంగపురంలోని మోహనరంగనాథ స్వామి దేవస్థానం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు పూజలు చేశారు. ఈఓ పోతుల రామ కోటేశ్వరరావు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వచ్చే నెల 12న ఎంపీ కనిమొళి గుంటూరు రాక

గుంటూరు మెడికల్: బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ విగ్రహావిష్కరణకు తమిళనాడు సీఎం స్టాలిన్ సోదరి, పార్లమెంట్ సభ్యురాలు కనిమొళి ఫిబ్రవరి 12న గుంటూరుకు వస్తున్నట్లు విగ్రహ కమిటీ కో-కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.